క్లుప్తంగా

అదనపు కొనుగోలు కేంద్రం ప్రారంభం



అదనపు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి కాంటాలు వేస్తున్న హమాలీలు

అర్వపల్లి : మండల పరిధిలోని కొమ్మాల గ్రామంలో గురువారం అదనపు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామంలో ఒకే కొనుగోలు కేంద్రం ఉండటం, అధికంగా ధాన్యం కేంద్రానికి రావడంతో కొనుగోళ్ల ప్రక్రియ ఆలస్యమవుతోంది. దీంతో అదనపు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని సాక్షిలో కథనం వేయగా అధికారులు స్పందించి పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రంలో వెంటనే ధాన్యం కాంటాలను మొదలు పెట్టారు. ఈ కార్యక్రమంలో సీఈఓ మెడెబోయిన రామస్వామి, కేంద్రం ఇన్‌చార్జ్ ఆడెపు శ్రీకాంత్, రైతులు బయ్య గంగయ్య, కుంటిగొర్ల శ్రీనివాస్, మెతుకు వెంకట్‌రెడ్డి, గునగంటి వెంకన్న, రామిడి వెంకట్‌రెడ్డి, ఎస్. లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెన్‌పహాడ్ : 11కేవీ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించనున్నందున పెన్‌పహాడ్ సబ్‌స్టేషన్ పరిధిలోని మాచారం, అనిరెడ్డిగూడెం, దూపహాడ్ సబ్‌స్టేషన్ పరిధిలోని న్యూబంజారాహిల్స్ తండా, సీతమ్మ తండా, ఎల్లప్పకుంట తండా, చినగార కుంట, పెదగారకుంట తండా, జల్మాలకుంట తండా గ్రామాలకు శుక్రవారం ఉదయం 7గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఇన్‌చార్జ్ ఏఈ రమేష్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గణేష్ మృతి తీరనిలోటు

ఆత్మకూర్(ఎస్) : రోడ్డు ప్రమాదంలో గణేష్ మృతి చెందడం విచారకరమని, గణేష్ మృతి పార్టీకి తీరనిలోటని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండల పరిధిలోని పాతర్లపహాడ్ గ్రామానికి చెందిన బీజేపీ మండల యువనాయకుడు బీమగాని గణేష్ బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కాగా గురువారం సంకినేని వెంకటేశ్వర్‌రావు పాతర్లపహాడ్‌లో గణేష్ మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. బాధిత కుటుంభ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పందిరి రాంరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ ఎండీ అస్లాం, గ్రామ శాఖ అధ్యక్షుడు గుంటూరు వీరస్వామి, మున్సిపల్ మాజీ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, పలిగంటి వీరేందర్, మల్సూర్‌గౌడ్, పోలగాని ధనుంజయ్ గౌడ్, దానియల్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక



మురళీధర్‌రెడ్డికి పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సూర్యాపేట : సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పని చేసిన దండ మురళీధర్‌రెడ్డి గురువారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పార్టీలో చేరారు. ఇటీవల ఆయన ఆసిఫాబాద్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ రాజీనామా చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. బీజేపీలో చేరానని, ఒకటి రెండు రోజుల్లో సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడిస్తానని పేర్కొన్నారు.

ప్రభుత్వ సలహాదారుడిని కలిసిన ఏపూరి సోమన్న



నరేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న సోమన్న

తిరుమలగిరి (తుంగతుర్తి) : బహుజన యుద్ధ నౌక, కాంగ్రెస్ నాయకుడు ఏపూరి సోమన్న గురువారం ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆయన నరేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం వేం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ అభివృద్ధికి కృషి చేయాలని, పార్లమెంట్ ఎన్నికల్లో గళాన్ని విప్పాలని సోమన్నను కోరారు.

మొక్కలను సంరక్షించాలి

పెన్‌పహాడ్ : మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని అన్నారం బ్రిడ్జి, నారాయణగూడెం, అనంతారం గ్రామాల్లో నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేసవి దృష్ట్యా మొక్కలు చనిపోకుండా చర్యలు చేపట్టాలన్నారు. మొక్కలకు ఎప్పటికప్పుడు నీటిని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ రవి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీచాంపూలాల్ జాతర

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు



జాతరకు హాజరైన భక్తులు

చివ్వెంల : మండల పరిధిలోని పులితండా గ్రామంలో గిరిజనుల ఆరాధ్యదైవం శ్రీచాంపూలాల్ స్వామి జాతరను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ జాతరకు సుమారు 200 సంవత్సరాలు చరిత్ర ఉంది. ఈ జాతరను ప్రతి సంవత్సరం శ్రీ రామ నవమి తర్వాత రెండు రోజుల పాటు నిర్వహించడం సంప్రదాయం.

సమీప జిల్లాల నుంచి..

జాతరకు జిల్లా నుంచే కాకుండా వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల నుంచి గిరిజనులు వేలాదిగా తరలివచ్చి తమ ఇష్టదైవానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ట్రాక్టర్లు, డీసీఎం, ఆటోల లో వచ్చి గుడిచుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకున్నారు.

వసతులు అంతంతే..

జాతరకు ప్రతి సంవత్సరం వేలం పాటలో లక్షలాది రూపాయలు వస్తున్నా భక్తులకు సౌకర్యం కల్పించడంలో అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు విఫలం అవుతున్నారని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం తాగునీటి సౌకర్యం లేకపోవడంతో వ్యవసాయ పొలాలను ఆశ్రయించాల్సి వస్తోందని తెలుపుతున్నారు. గతంలో జాతర పరిసర ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు ఉండటంతో భక్తులు తమ వంటలను అక్కడే చేసుకునేవారు. ప్రస్తుతం ఆలయం చుట్టూ వ్యవసాయ పొలాలు ఉండటంతో స్థలం లేక దూరంగా భక్తులు వంట చేసుకుని అక్కడే భోజనాలు చేశారు. ఆలయ కమిటీ స్థల సేకరణ చేయకపోవడం బాధాకరమని భక్తులు వాపోతున్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్ఐ బి.వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్త్ నిర్వహించారు.

ప్రత్యేక పూజలు చేసిన మాజీ మంత్రి..

జాతరలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ వేడుకల్లో ఏఐసీసీ నాయకుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావత్ వీరన్న నాయక్, మాజీ జెడ్పీటీసీ చింతమల్ల రమేష్, గుగులోతు నాగు నాయక్, ధరావతు లాలు నాయక్, వెన్న మధూకర్ రెడ్డి, పఠాన్ సమీర్, పాండు నాయక్, వీరబోయిన మహేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



జాతరలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



జాతరలో వెలిసిన దుకాణాలు



దుకాణాల వద్ద భక్తుల సందడి



పూజలు చేస్తున్న మాజీ మంత్రి దామోదర్ రెడ్డి

కేసీఆర్ బస్సుయాత్రకు స్వాగతం

తిరుమలగిరి : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన బస్సుయాత్ర గురువారం సాయంత్రం సూర్యాపేట నుంచి తిరుమలగిరి మీదుగా భువనగిరికి వెళ్లింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు స్థానిక తెలంగాణ చౌరస్తాలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు స్వాగతం పలికారు. బస్సులోని కేసీఆర్ అభివాదం చేసుకుంటూ వెళ్లారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, కల్లెట్లపల్లి శోభన్‌బాబు, రామ్మూర్తి గౌడ్, పాషా, త్రిశూల్, నరేష్, చంద్రమౌళి, రవీందర్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తిరుమలగిరిలో కేసీఆర్ బస్సుయాత్రకు స్వాగతం పలుకుతున్న నాయకులు

అర్వపల్లిలో కేసీఆర్‌కు ఘన స్వాగతం

అర్వపల్లి : కేసీఆర్ బస్సు యాత్రకు అర్వపల్లిలో గురువారం బీఆర్ఎస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. బాణసంచాలు కాల్చుతూ జై కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్, మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ దావుల మనీషా, బైరబోయిన రామలింగయ్య, మొరిశెట్టి ఉపేందర్, గోసుల విజయ్, కడారి నరేష్ పాల్గొన్నారు.



అర్వపల్లిలో కేసీఆర్ బస్సు యాత్రకు స్వాగతం పలుకుతున్న నాయకులు

బోళ్ల వెంకటమ్మ మృతికి సంతాపం

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ మండల పరిధిలోని గాజుల మల్కాపురం గ్రామానికి చెందిన బోళ్ల వెంకటమ్మ (52) మృతి చెందారు. దీంతో గురువారం ఆమె మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాతాల వెంకట్‌రెడ్డి, దేవిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, వెంకన్న, కుందూరు వెంకట్‌రెడ్డి, కర్ణాకర్, వెంకట్‌రెడ్డి, బండి వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

తిరుమలగిరి : భువనగిరి పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి భారీ ఆధిక్యంతో విజయం సాధిస్తారని తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్ అన్నారు. గురువారం తిరుమలగిరిలోని శుభమస్తు ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మే 13న జరిగే పార్లమెంటు ఎన్నికల్లో తుంగతుర్తి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీకి లక్ష మెజార్టీ రావాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ఈ నెల 27న జరిగే కాంగ్రెస్ పార్టీ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాలకుర్తి రాజయ్య, మున్సిపల్ చైర్మన్ శాగంటి అనసూయ, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు కందుకూరి అంబేద్కర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సంకెపల్లి కొండల్‌రెడ్డి, సుంకరి జనార్దన్, దాచేపల్లి వీరశేఖరయ్య, జమ్మిలాల్, పేరాల వీరేష్, వైస్ చైర్మన్ సరళా యాదవరెడ్డి పాల్గొన్నారు.

ఓటరు స్లిప్పులు ప్రతి ఓటరుకూ అందాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలో ఇంటింటికీ తిరిగి ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తున్న బీఎల్ఓ భాగ్యమ్మ

ఆత్మకూర్(ఎస్) : ఓటరు స్లిప్పులు ప్రతి ఓటరుకూ అందించాలని, గ్రామ స్థాయిలో బీఎల్ఓల పాత్ర కీలకమని సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవ్‌రావు అన్నారు. గురువారం మండల తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలతో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. అంతకుముందు కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ ద్వారా బీఎల్ఓలతో మాట్లాడారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ వినోద్‌కుమార్, బీఎల్ఓలు పాల్గొన్నారు.

అర్వపల్లి : ఓటరు స్లిప్పులను బీఎల్ఓలు ఇంటింటికీ తిరిగి పంపిణీ చేయాలని తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు కోరారు. గురువారం మండల వ్యాప్తంగా ఓటర్ స్లిప్పుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలో 24,177 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. ఈ ఓటర్లందరికీ ఓటరు స్లిప్పులు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ప్రతి ఓటరు వచ్చే నెల 13న జరిగే ఎన్నికల సందర్భంగా స్లిప్పులను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓలు పాల్గొన్నారు.

తుంగతుర్తి : వచ్చే నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా అసెంబ్లీ సెగ్మెంట్‌ల పరిధిలోని బీఎల్ఓలు ఓటరు ఇన్ఫర్మేషన్ స్లిప్పులను పంపిణీ చేయాలని తహసీల్దార్ రమణారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీఎల్ఓలకు ఓటర్ స్లిప్పుల పంపిణీపై నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. నేటి నుంచి బీఎల్ఓలు ఓటర్లకు ఇంటింటికీ ఓటరు ఇన్ఫర్మేషన్ స్లిప్పులు పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



చందన



వెంకటేష్



హర్షిత

సూర్యాపేట టౌన్ : జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్స్ 2024 ఫలితాల్లో జయ జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. అన్ని కేటగిరీల్లో కలిపి జాతీయస్థాయిలో పదివేలలోపు ర్యాంకుల్లో కళాశాలకు చెందిన 16 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారని కళాశాల కరస్పాండెంట్ వేణుగోపాల్ బుధవారం తెలిపారు. వీరిలో కందిబండ వెంకటేష్ (528), గుజ్జ చందన (954), వర్షిత (1183), వర్షిని (4031), సిద్ధార్థ్ (4098), సింధు (4451), గోపి (4830), సాయి శివరంజని (5921), అక్షయ (6433), గౌతమ్ కుమార్ (7651), కౌశిక్ (7846), అభిజిత్ (8399), నివేదిత (8985), విష్ణు తేజ (9099), దీక్షిత (9338), సోమేశ్వర్ (9755) ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. మొత్తం 129 మంది విద్యార్థుల్లో 48 మంది విద్యార్థులు అడ్వాన్సుడ్ పరీక్షకు అర్హత సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జ్యోతి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

అసమాన్య ఫలితాలు..

సామాన్య విద్యార్థుల నుంచి అసమాన్య ఫలితాలు సాధించడమే లక్ష్యంగా శ్లోక ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ కృషి చేస్తోందని కళాశాల కరస్పాండెంట్ మారం వెంకటరెడ్డి తెలిపారు. గురువారం విడుదలైన జేఈఈ మెయిన్స్ 2024 ఫలితాల్లో సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన శ్లోక ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ పర్సంటైల్ సాధించగా వారిని అభినందించి మాట్లాడారు. కళాశాలకు చెందిన పి.శంకర్ 99.38, డి.శివాని 99.03, ఎం.వరుణ్ 95.72, ఏ.యక్షేంద్ర 94.40, సీహెచ్. వేణుగోపాల్ 90.06 పర్సంటైల్ సాధించినట్లు తెలిపారు.

పశుపోషణపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అర్జున్

అర్వపల్లి : ఎండలు తీవ్రమైనందున పశువుల పోషణ విషయంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ బి. అర్జున్ సూచించారు. వేసవిలో పశుపోషణ, పశుసంరక్షణపై గురువారం అర్వపల్లిలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత పెరుగుతుండటం వల్ల రైతులు ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే పశువులను బయట మేతకు తిప్పాలన్నారు. పశువులు ఎండదెబ్బకు గురైతే వెంటనే చికిత్స కోసం పశువైద్యశాలకు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో వీఎల్ఓ కేఎస్ఎస్ పద్మ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మలేరియా దినోత్సవం



తిరుమలగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



అర్వపల్లి : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

తిరుమలగిరి : అంతర్జాతీయ మలేరియా దినోత్సవం సందర్భంగా తిరుమలగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మల్లెల వందన మాట్లాడారు. భారత దేశం మలేరియా రహిత దేశంగా అవతరించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ బిచ్చునాయక్, సూపర్‌వైజర్ స్వరూపాకుమారి, లలిత, నర్సింహారెడ్డి, విజయ్, శ్రీలత, వెంకటమ్మ, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : అంతర్జాతీయ మలేరియా దినోత్సవం సందర్భంగా అర్వపల్లిలో గురువారం స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యధికారి డాక్టర్ చిలుకూరి మణిదీప్ మాట్లాడుతూ ఇళ్లను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని దోమలను నిర్మూలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ ఎల్.చరణ్, ఎంఎల్‌హెచ్‌పీలు ఎన్.గౌతమి, టి.వక్షిత, జి.వాణి, హెల్త్ అసిస్టెంట్‌లు కుంభం వీరయ్య, బి.ప్రసాద్, సైదమ్మ, సరస్వతి, జ్యోతి, టి.నాగరాణి, శకుంతల, బి.శ్వేత, గిరిజ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తుంగతుర్తి : మలేరియా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డాక్టర్ లింగమూర్తి అన్నారు. గురువారం ప్రపంచ మలేరియా నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని రావులపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వెంపటి గ్రామంలో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ సముద్రాల సూరి, పీహెచ్ఎన్ సైదమ్మ, వైద్యసిబ్బంది సోమన్న, యాదగిరి, చారి, భారతి, రూప, స్వాతి, జయమ్మ, కమల, శైలజ, నాగమణి, నాగలక్ష్మి, ఉమ, ఆఫ్రిన్, మౌనిక, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నాగారం : ప్రపంచ మలేరియా నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గురువారం ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు మలేరియా వ్యాధిపై అవగాహన కల్పించారు. 2030 నాటికి దేశంలో మలేరియాను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు హర్షవర్ధన్, నాజియా, వైద్య సిబ్బంది, ఆశలు తదితరులు పాల్గొన్నారు.



తుంగతుర్తి : వెంపటిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



నాగారంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

డబ్బుకు ఆశపడి ఓట్లేసి మోసపోవద్దు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జైభారత్ నాయకులు

అర్వపల్లి : డబ్బుకు ఆశపడి ఓట్లేసి ఐదేళ్ల పాటు మోసపోవద్దని జైభారత్ జాతీయ ఉపాధ్యక్షుడు గుండు వెంకన్న ఓటర్లను కోరారు. డబ్బుకు ఓటు అమ్ముకుంటే బతికున్నా.. శవంతో సమానం పోస్టర్లను జైభారత్ ఆధ్వర్యంలో అర్వపల్లిలో గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల నైతిక ప్రవర్తన, అర్హత, నిబద్ధత, సమర్థత తదితర విషయాలను చూసి మాత్రమే అభ్యర్థులను ఎన్నుకోవాలని కోరారు. జైభారత్ ఉద్యమం ఆధ్వర్యంలో జైభారత్ జస్ట్ ఓట్ క్యాంపెయిన్‌ను రాష్ట్ర వ్యాప్తంగా ఉధృతంగా చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జైభారత్ బీసీ పోరాటవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి దడిపల్లి వెంకట్, పూలే, అంబేద్కర్ ఆశయ పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఈదురు వీరపాపయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన



ధాన్యంలో తేమశాతాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ

అర్వపల్లి : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని తుంగతుర్తి డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీఏ బి.జగ్గునాయక్ కోరారు. గురువారం అడివెంల గ్రామంలోని సెర్ప్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ధాన్యంలో 17 శాతంలోపు తేమ ఉండేలా కేంద్రాలకు తేవా లని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ నేరెళ్ల సత్యం, కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జ్ భవాణి పాల్గొన్నారు.

అడ్వకేట్స్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా వెంకటేశ్వర్‌రావు

చివ్వెంల : సూర్యాపేట జిల్లా కోర్టు అడ్వకేట్ మ్యూచువల్లి ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ అధ్యక్షుడిగా గుడిపూరి వెంకటేశ్వర్‌రావు ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా కోక రంజిత్ కుమార్, ఉపాధ్యక్షుడిగా గూడూరి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా పత్తిపాక శ్రీనివాస్‌రావు, కోశాధికారిగా డాకా శ్రీనివాస్ నాయుడు, డైరెక్టర్లుగా నాతి సవీందర్ కుమార్, గొండ్రాల అశోక్, కారింగుల వెంకటేశ్వర్లు, ఏడిండ్ల అశోక్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా టేకులపల్లి శ్రీనివాస్‌రావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

మద్దిరాల : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మద్దిరాల మండల పరిధిలోని పోలుమల్ల, గోరెంట్ల, చావ్లతండా గ్రామాల్లో పోలీసులు గురువారం కేంద్ర బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మధునాయుడు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మద్దిరాల : మద్దిరాల మండల కేంద్రానికి చెందిన బోలగాని రాములు గత 10 సంవత్సరాల క్రితం హైదరాబాద్‌లో పెయింటింగ్ వేస్తూ బిల్డింగ్‌పై నుంచి పడి మృతి చెందాడు. దీంతో 1993-1994 బ్యాచ్ 10వ తరగతి బాల్యమిత్రులు మృతుడి చిన్న కుమార్తె మనీషా వివాహానికి అండగా ఉండాలని తలిచి.. ఆమె వివాహ అనంతరం రూ.1లక్షను ఆర్థికసాయంగా అందించారు. రాములు కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో బాల్య మిత్రులు గుండ్ల రమేష్, నవ్వుల మల్లారెడ్డి, వడ్డాణం నవీన్, కోట లక్ష్మీనారాయణ, రాజోలు ప్రసాద్ శర్మ, పెద్దూరి రూప, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బొడ్రాయి ఉత్సవాలు

మద్దిరాల : కుక్కడంలో బొడ్రాయి ఉత్సవాల్లో భాగంగా గురువారం మహిళలు బొడ్రాయికి జలాభిషేకం చేశారు. అదే విధంగా మహాకుంకుమార్చన పూజను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో పూజారులు వేణుగోపాలచార్యులు, వరదచార్యులు, వల్లపు కళింగం, ముక్కాల అవిలమల్లు, మద్దెల భిక్షపతి, వాసుదేవరెడ్డి, మద్దెల భిక్షపతి, కాశీం, సోమయ్య, వీరస్వామి, మల్లయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

నాగారం : రెండు బైక్‌లు ఢీకొని పలువురికి గాయాలైన సంఘటన నాగారంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డగూడూరు మండలం చౌళ్లరామారం గ్రామానికి చెందిన చుక్క మల్లేష్ నాగారంబంగ్లాలోని తన బంధువుల ఇంటికి వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో సూర్యాపేట-జనగామ జాతీయ రహదారి పక్కన బైక్‌ను ఆపి నిలబడ్డాడు. అదే సమయంలో సూర్యాపేట నుంచి తిరుమలగిరి వైపు బైక్‌పై వెళ్తున్న వేములపల్లి మండలం అమనగల్ గ్రామానికి చెందిన గడ్డం అశోక్, తిప్పర్తి మండలం మామిడాలకు చెందిన నకిరేబోయిన శివ అనే ఇద్దరు యువకులు ఆగి ఉన్న మల్లేష్ బైక్‌ను వేగంగా వచ్చి ఢీకొట్టారు. మల్లేష్‌కు తీవ్రగాయాలు కాగా, మిగతా ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనపై స్థానిక ఎస్ఐ పి.వెంకట్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.